# భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)

# కేంద్ర కమిటీ

**పత్రికా ప్రకటన**

**తేది: 4 మార్చ్, 2019**

## భారత పాలకవర్గాల యుద్ధోన్మాద చర్యలను ఖండించండి.

## నిజమైన శాంతి-సుస్థిరతల కోసం పోరాడండి.

ఫిబ్రవరి 14 నాటి పుల్వామా దాడికి భారత ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలని మా పార్టీ ఇప్పటికే ప్రకటించింది. పుల్వామా ఆత్మాహుతి దాడి తర్వాత దేశంలోని అన్ని ప్రాంతాలలో కశ్మీరీ ప్రజలపై పెచ్చరిల్లిన హింసోన్మాదాలకు భారత పాలక వర్గాలు, హిందుత్వ శక్తులే కారణం తప్ప మరెవరూ కాదు. పుల్వామా దాడిలో 45 మంది సీ.ఆర్.పీ. జవాన్ల మరణం తర్వాత యావత్ దేశంలో దేశ ప్రధాని మోదీ సహ దుష్ట భారతీయ జనతా పార్టీ, హిందుత్వ శక్తులన్నీ ప్రజలలో యుద్ధోన్మాదాన్ని తెగ రెచ్చగొట్టాయి. మీడియా, సామాజిక మాధ్యమాలన్నీ తమ వృత్తి ధర్మాలకు తిలోదకాలు ఇచ్చి పాకిస్థాన్‌కు వ్యతిరేకంగా దేశ ప్రజలను రెచ్చగొట్టడంలో తమ యావత్ శక్తిని వినియోగించాయి. దేశమంతా యుద్ధ మేఘాలు అలుముకునేలా చేశాయి. పుల్వామా దాడిలో చనిపోయిన సీ.ఆర్.పీ. జవాన్ల 'శౌర్య పరాక్రమాలను' అలుపూ-సొలుపూ లేకుండా స్తుతించారే తప్ప కశ్మీర్ లోయలో వారవలంభించే ప్రజా వ్యతిరేక చర్యలే హాదిల్‌లను, ఆరిఫ్‌లను సృష్టిస్తున్నాయనే వాస్తవాలను, తమ భవిష్యత్తుపై విశ్వాసాన్ని కోల్పోతున్న యువత దుస్థితిని దుర్బుద్ధితో మరుగున పరిచారు. ఆ దాడిలో ఉపయోగించిన విస్ఫోటకం సహ ప్రతి విషయంలో మీడియా అనేక అవాకులు చవాకులతో అవాస్తవాలను ముందుకు తెచ్చి దేశ ప్రజలలో ఒక వార్ హిస్టీరియాకు ప్రాణం పోసింది. ఈ దూకుడు, దుర్మార్గ ఉన్మాద చర్యలన్నీ ఖండించాలనీ భారత ప్రజలకు మా పార్టీ విజ్ఞప్తి చేస్తోంది. నిర్భయంగా వాస్తవాలను వెలికి తీసి ప్రజల ముందుంచాల్సిందిగా ప్రజాస్వామికవాదులను, బుద్ధిజీవులను, ప్రజాహిత పాత్రికేయులను మా పార్టీ కోరుతోంది. అయితే, దేశంలో నెలకొన్న వర్తమాన పరిస్థితులలో ప్రజాహిత, దేశభక్త స్వరాలను ఎంతమాత్రం సహించకుండా నిర్ధాక్షిణ్యంగా ఫాసిస్టు శక్తులు అణచివేతకు పూనుకుంటాయన్నది గుర్తెరిగి చాకచక్యంగా ప్రజల అండదండలతో అందుకు సిద్ధపడాలని కోరుతోంది.

ఫిబ్రవరి 14నాటి పుల్వామా దాడికి ఏకైక కారణం పాకిస్థానే అనే నెపంపై ఫిబ్రవరి 26 ఉదయం భారత వైమానిక దళం విమానాలు ఆ దేశ భూభాగంలోకి చొచ్చుకపోయి గగనతలం నుండి బాలాకోట్‌లో బాంబులు కురిపించాయి. పాకిస్థాన్‌లోని జైశ్-ఎ-మహ్మద్ శిక్షణా శిబిరాలపై దాడి చేసి, అక్కడ పుల్వామా తరహాలో కశ్మీర్‌లో మరిన్ని దాడులకు సిద్ధమవుతున్నవారిని పెద్ద ఎత్తున అంతమొందించామనీ భారతదేశం విజయగర్వంతో ప్రకటించి ఉప్పొంగిపోయింది. దీనిని పాకిస్థాన్ నిర్ద్వంద్వంగా ఖండిస్తే భారత విపక్షాలు బాధ్యతగా ప్రజలకు ఆధారాలు చూపమంటున్నాయి. కానీ, నిజానికి ఆ దాడిలో భారతదేశం ఒక మిగ్ విమానాన్ని కోల్పోయి చావు తప్పి కన్ను లొట్టపోయిన చందంగా పైలట్ వింగ్ కమాండర్ అభినందన్ వర్ధమాన్ పాకిస్థాన్‌కు బందీగా పట్టుబడడం భారత దేశ దాడి సామర్థ్యాన్ని వెల్లడించింది. భారతదేశ దుస్సాహసిక, రెచ్చగొట్టుడు చర్యలను పాకిస్థాన్ ఎదుర్కోవడమే గాకుండా 'కుక్క కాటుకు చెప్పు దెబ్బ' చందంగా తన విమానాలతో భారత దేశంలోని పలు సైనిక ఇన్‌స్టాలేషన్స్‌ను లక్ష్యంగా చేసుకొని గగనతలంపై నుండి చేరుకొని తన సత్తాను చాటుకుంది. ఉన్మాదంతో భారత ప్రధాని చేస్తున్న మతి లేని సమస్త ప్రకటనలకు సమాధానంగా పాకిస్థాన్ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ రెండు రోజుల లోపే వింగ్ కమాండర్ అభినందన్‌ను సగౌరవంగా భారత దేశానికి అప్పగించాడు. దాన్ని నిజాయితీగా జీర్ణం చేసుకొలేని హిందుత్వ శక్తులు, పాకిస్థాన్‌ను అభినందించడానికి దమ్ములు చాలని దుష్ట మోదీ భజనపరులు అదేదో తమ మోదీ దౌత్యనీతి విజయమనీ, పాకిస్థాన్ మెడలు వంచి వింగ్ కమాండర్‌ను విడుదల చేయించుకున్నామనీ పూనకం వచ్చిన చందంగా వాగడం సిగ్గు పడాల్సిన విషయం.

భారతదేశ సైనికులు ఇప్పటికీ 1960ల నాటి రష్యా తయారీ 7.62 డ్రెగ్నోవ్ సెమి- ఆటోమెటిక్ స్నైపర్ రైఫిల్‌లను వాడుతూ ఆధునిక పాకిస్థాన్ స్నైపర్ ఆయుధాల ముందు ప్రాణాలు కోల్పోతూ తమకూ ఆధునిక స్నైపర్ ఆయుధాలు కావాలని చేస్తున్న దశాబ్దాల నాటి డిమాండ్ పట్టించుకోని మోదీ, వారి ప్రాణాలను బలిగొంటూ ఇపుడు రాఫెల్ త్వరలో భారత గగనతలంపై ఎగురనుంది అంటున్నాడు. అందులో జరిగిన భారీ ముడుపుల అవినీతి వ్యవహారాలకు మసి పూసి మారేడుకాయ చేస్తున్నాడు. మోదీ కనీసం బూర్జువా సార్వభౌమాధికారాన్నైనా ఏమాత్రం గౌరవించకుండా, అత్యంత ఉన్మాదపూరిత, ప్రమాదకర, రెచ్చగొట్టే ప్రకటనలు చేయడం, 'పాకిస్థాన్‌తో మాట్లాడడం వృధా' అనడం, 'ఇంట్లో దూరి దాడి చేయడం తమ సిద్ధాంతం' అనడం గర్హనీయం.

భారత వైమానిక దళాలు తమ దేశంపై దాడి జరిపాయనీ, మా సైనికులు అప్రమత్తంగా ఉండడంతో అవి అక్కడ ఎలాంటి నష్టాన్ని

కలగించ లేకపోయాయనీ, తమ విమానాలు వాటికి ధీటుగా బదులు చెప్పడంతో అవి పరుగు తీశాయనీ పాకిస్థాన్ విస్పష్టంగా ప్రకటించింది. రెండు దేశాలలోని కుబేరుల నియంత్రిత మీడియా నిజానికి వాస్తవాలను వెల్లడి చేయడం లేదు. భారత దేశంలోని విపక్షాలూ సాక్ష్యాధారాలు కోరుతూంటే మోదీ తన వాచాలత్వంతో వాటిని ఎద్దేవ చేస్తూ, వాస్తవాలను ససేమిరా ప్రజల ముందుంచకుండా దొరికిందే తడవుగా రాఫెల్ యుద్ధ విమానాలను విపక్షాలు అడ్డు కోకుంటే భారత వైమానిక బలగాల సత్తా మరెంతో ప్రదర్శితమయ్యేదంటూ ఎన్నికల సభలలో దేశ ప్రధాని తెగ వాపోతున్నాడు. సరిహద్దులలో  ఇరువైపులా కాల్పుల విరమణ ఒప్పందాలను పదేపదే ఉల్లంఘిస్తూ రెండు దేశాల సైన్యాలు భారీ కాల్పులకు దిగుతున్నాయి. సరిహద్దు ప్రజలను అనుక్షణం భయాందోళనలకు గురి చేస్తున్నాయి. మరోవైపూ కశ్మీర్ లోయలో ఉద్యమకారులను మట్టుబెట్టే ఆపరేషన్‌ల నిర్వహణ పేరుతో ఎడతెరిపి లేకుండా కొనసాగిస్తున్న గాలింపు చర్యలలో భారత భద్రతా బలగాలు పదే పదే తమ జవాన్‌లను నష్టపోతున్నాయి. దీనికి భారత ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలి.

మోదీ తన ఐదేళ్ల పాలనలో చేపట్టిన అనేక ప్రజా వ్యతిరేక విధానాల ఫలితంగా 2019 లోక్‌సభ ఎన్నికలలో తిరిగి తగిన మెజార్టీతో అధికారానికి రాగలనన్న విశ్వాసాన్ని కోల్పోయాడు. మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్ విధానసభ ఎన్నికల ఫలితాలు ఆయన దూకుడుకు కళ్లెం వేశాయి. ఆ ఓటమితో పాటు ఆయన నియంతృత్వ ధోరణులు స్వంత పార్టీలోనే ముసలకాన్ని పుట్టించడంతో దేశ వ్యాప్తంగా ఆయన ఒంటరైపోయి ఏకాకి పర్యటనలు, ఒంటరి వీడియో కాన్ఫరెన్స్‌లు సహా మొత్తం ప్రచార భారాన్నంతా తన మీదే వేసుకొని తిరుగక తప్పడం లేదు. తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడంలో ఉద్దండులైన హిందుత్వ శక్తులు దేశంలో ఆకలి, ఆత్మహత్యలు, నిరుద్యోగం, అధిక ధరలు, రైతుల పంటలకు గిట్టుబాటు ధరలు లేకపోవడం లాంటి అనేక సమస్యలతో ప్రజలు సతమతమవుతుంటే మోదీగారికి మాత్రం రానున్న లోకసభ ఎన్నికలలో ఓట్లు దండుకోవడమెలా అన్నదే సర్వస్వమై పోయి చివరకు పుల్‌వామాలో చిమ్మిన భారతీయ జవాన్‌ల నెత్తురు, వింగ్ కమాండర్ అభినందన్ వర్ధమాన్ బతుకుపై పాచికలు విసరుతూ రాజకీయ లబ్ది కోసం అర్రులు చాస్తున్నాడు. ప్రతిపక్షాల ప్రశ్నలకు జవాబులు ఇవ్వలేకపోతున్న మోదీ ఒకవైపు నర్మ గర్భంగా తమ వైమానిక దాడుల వైఫల్యాన్ని అంగీకరిస్తూనే మరోవైపూ అన్ని రాజకీయ పక్షాల నోళ్ళు మూయించడానికి కాషాయ ఉగ్రవాది మోదీ శుష్క దేశభక్తి, జాతీయవాదాన్ని ముందుకు తెస్తున్నాడు. ఈ వైఖరినీ మా పార్టీ నిర్ద్వంద్వంగా ఖండిస్తున్నది. దేశాన్ని యుద్ధ జ్వాలలలోకి ఈడ్చి ఎన్నికలలో లబ్ది పొందడానికి పాలక వర్గాలు చేస్తున్న కుట్రలను ప్రజలు ఓడించాలి. హిందుత్వ శక్తుల యుద్ధోన్మాద చర్యలను ముక్తఖంఠంతో ఖండించి దేశంలో ప్రధానంగా జమ్మూ కశ్మీర్‌లో శాంతి సుస్థిరతల కోసం ప్రజలు పోరాడాలి. సంఘ్ ముఠా పని కట్టుకొని అక్కడ మతపరమైన విభజనను పెంచి పోషిస్తోంది. కశ్మీర్‌లోని కథువాలో 8 యేళ్ల పాప ఆసిఫాపై అత్యాచారం జరిపి నిర్ధాక్షిణ్యంగా ఆ అమ్మాయిని హత్య చేయడాన్ని యావత్ దేశం ఖండిస్తే అక్కడి భాజపా సిపాయిలు దుండగుల పక్షం వహించగా, మోదీ చాలా కాలం దానిపై నోరు విప్పలేదు. పంచశీల సూత్రాలను సైతం ఏకంగా తుంగలో తొక్కుతూ శుష్క దేశభక్తి, జాతీయవాదాలతో పాకిస్థాన్‌ను నిందించడం ముందు మానుకోవాలి.

కశ్మీర్ స్వయం ప్రతిపత్తిని గుర్తించే ఇప్పటికే ఆర్టికల్ 370ని 43 సార్లు సవరించడంతో కేవలం అస్థిపంజరంలా మిగిలిన రాజ్యాంగంలోని ఆర్టికల్ 370తో పాటు ఆర్టికల్ 35ఏ ను రద్దు చేయడానికి రంగం సిద్ధం చేశారు. కశ్మీర్‌లోని అన్ని సమస్యలకు మూల కారణం కేవలం పాకిస్థానే అంటూ అక్కడికి బలగాల మీద బలగాలను తరలిస్తూ అక్కడి ప్రజలను విదేశీయులుగా చూడడం, యువతను శత్రువులుగా చూడడం తక్షణం మానుకోవాలి. కశ్మీర్ ప్రజల సమస్యపై కశ్మీర్ పోరాట సంస్థల నాయకత్వాన్ని ఎప్పుడూ గృహనిర్భంధం లేదా కటకటాలపాలు చేయడం కాకుండా వారిని గౌరవిస్తూ వారితో చర్చించి ఆ జాతి ప్రజా ఆకాంక్షల వెలుగులో దానిని రాజకీయంగా పరిష్కరించకుండా కశ్మీర్ జాతి ప్రజల పోరాటాన్ని కేవలం శాంతి భద్రతల సమస్యగానే చూసినంత కాలం దానిని ఆపడం ఎవరి తరం కాదు.

**అభయ్,**

**అధికార ప్రతినిధి,**

**కేంద్ర కమిటీ,**

**భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు).**